17వ

# సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,20 జనవరి 2024



## ఎస్.ఐ. కొలువు సాధించిన మోడరన్ పూర్వ విద్యార్థులకు లయిన్ జి.వి.రావు అభినందన



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఇటీవల జరిగిన ఎస్.ఐ.పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభతో ఎస్.ఐ.ఉద్యోగాలు సాధించిన మోడరన్ విద్యాసంస్థల పూర్వవిద్యార్థులు మేడిశెట్టి లక్ష్మీ సత్యవతి, కారుమూరి సూర్యవంశీ లను మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు అభినందించారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే ఎస్.ఐ.లుగా సెలెక్ట్ అయిన సత్య, సూర్యవంశీ ఇరువురు మోడరన్ విద్యాసంస్థలలో చదవడం ఆనందదాయకం అని పేర్కొంటూ, భవిష్యత్ నందు మరిన్ని ఉన్నతమైన హోదా పొందే ప్రతిభ ఇరువురికి ఉందని అన్నారు. అనంతరం మోడరన్ అకడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి మాట్లాడుతూ శనివారం ప్రతిష్టాత్మకంగా జరుగబోవు మోడరన్ హైస్కూల్ వార్షికోత్సవమునకు సత్య, సూర్యవంశీ ఇరువురు ఇన్స్పైరింగ్ జెమ్స్ గా హాజరయి ప్రస్తుత విద్యార్థులలో స్ఫూర్తి నింపుతారని పేర్కొన్నారు. అనంతరం సత్య మాట్లాడుతూ తాను హైస్కూల్, ఇంటర్ కూడా మోడరన్ విద్యాసంస్థలలో చదివానని, ఈ రోజు తాను ఎస్.ఐ. పోస్ట్ సాధించడానికి జి.వి.రావు ఆధ్వర్యంలో మోడరన్ హైస్కూల్ నందు డాక్టర్ చుక్కా రామయ్య స్పేస్ ప్రోగ్రామ్, అలాగే మోడరన్ ఇంటర్ కాలేజీలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దిన విశిష్ట బోధన సహకరించాయని పేర్కొన్నారు. అనంతరం మరో విజేత సూర్య వంశీ మాట్లాడుతూ తాను కూడా మోడరన్ హైస్కూల్ నందు స్పేస్ ప్రోగ్రామ్ చదివానని, తన విజయానికి మోడరన్ విద్యాసంస్థలు ఇచ్చిన స్ఫూర్తి మరువలేనిదని పేర్కొన్నారు.

# పౌర జీవనానికి ప్రామాణికం రాజ్యాంగం

- అణగారిన వర్గాల ఆశాజ్యోతి డా.బి.ఆర్ అంబేద్కర్
- అంబేద్కర్ ఆశయాల ప్రతి రూపంగా సామాజిక న్యాయ శిల్పం
- డా.బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణకు హాజరవుతున్న జిల్లా వాసులు
- అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని పాలన చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డి
- జిల్లా ఇంఛార్జి మంత్రి వేణుగోపాల్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందు 1931లో కుల గణన జరిగిందని నేడు అంబేద్కర్ విగ్రహఆవిష్కరణరోజున కులగణన ప్రారంభించడం అంబేద్కర్‌కు ఇస్తున్న ఘనమైన నివాళిగా జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర బీసీ సంక్షేమం,సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం సామాజిక న్యాయ శిల్పం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల ఎత్తుగల కాంస్యవిగ్రహాన్ని ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేరాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గం నుండి స్వచ్ఛందంగా నాయకులు, ప్రజలతో కలిసి ర్యాలీగా మంత్రి బయలు దేరి వెళ్ళారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాల్ కృష్ణ మాట్లాడుతూ,స్వాతంత్ర్యం అనంతరం జరగని కారణం చేత అనేక మందిలో అపోహలు ఉన్నాయని వాటన్నింటినీ పటాపంచలుచేసి, పరిష్కరించే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి కులగణన ప్రక్రియను ప్రారంభించడం, భారత రాజ్యాంగ నిర్మాతడాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు ఘనమైన నివాళిగా భావిస్తునట్లు పేర్కొన్నారు. భారత దేశంలో పౌర జీవనానికి ప్రామాణికం రాజ్యాంగం అయితే ఆరాజ్యాంగానికి అనుగుణంగా జీవించేవాడు నిజమైన ధర్మ మార్గాన నడుస్తాడని నాకున్న నమ్మకం అని మంత్రి పేర్కన్నారు. రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ రూప శిల్పం ఆవిష్కరణను చూసి తరించేందుకు రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి నాయకులతో కలిసి 15 బస్సుల్లో బస్సుకు 60 మంది చొప్పున వెళుతున్నట్లుఆయనపేర్కొన్నారు.
విజయవాడలో జరుపుకుంటున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాది మంది తండోప తండాలుగా తరలివస్తున్నట్లు తెలిపారు. ప్రజానీకానికి రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నాయకులకు ప్రజలకు ఈ సందర్భంగా ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

దేశ సంపద సంపన్నుడికే కాదు సామాన్యుడికి కూడా అందించాలనే ఆకాంక్షతో అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా వారి జీవితాల్లో వెలుగు నింపాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఆమహనీయుడును ఆదర్శంగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని చూసి తప్పకుండా అమలుపరుస్తున్న సీఎంవైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలుస్తారని మంత్రి వేణు పేర్కొన్నారు.

## రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం



కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలోని వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్–2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న వివిధ కార్యకలాపాలు, ఫారం 6, 7, 8 లకు పరిష్కారాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని ఆమె వివరించారు. జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన కనీస సౌకర్యాలైనా విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మురుగు దోడ్లు, ర్యాంప్ నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఈవీఎం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. సమావేశంలో ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), పెద్దిరెడ్డి రవికిరణ్ (భాజపా), గదుల సాయిబాబా (టీడీపీ), సబ్బారపు అప్పారావు (బీఎస్పీ), మోర్త రాజశేఖర్ (సీపీఎం), నరాల శివ (ఆప్), కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం.జగన్నాథం, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామ ప్రతిష్ఠ రోజున దీపాలు వెలిగించండి

- బిజెపి జిల్లా అధ్యక్షుడు యాళ్ల




**అల్లవరం, మేజర్ న్యూస్ :** అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం రోజు ఈనెల 22న దేశంలోని అన్ని ఆలయాలు కూడా సిద్ధం కావాలని, ఇందుకోసం దేవాలయాలన్నింటినీ స్వచ్ఛందంగా శుభ్రం చేయాలని ప్రధాని మోడీ సూచించారు. ప్రధాని పిలుపును అందుకున్న బిజెపి జిల్లా అధ్యక్షులు యాళ్ల దొరబాబు అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా కోనసీమ జిల్లాలోని తమ ఊరిలోని దేవాలయాలను శుభ్రం చేసి తర్వాత ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి భక్తిని చాటుకోవాలని దొరబాబు పిలుపునిచ్చారు.

## గోవిందగిరి క్షేత్రంలో స్వామివారికి అభిషేక సేవలు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం ఐ.పోలవరం తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహిస్తున్న గోవిందగిరి క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం శ్రీవారికి అభిషేక సేవలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు సాయిరాంశర్మ వేదం చెప్పగా ఆలయ అర్చకులు పార్ధస్వామి, మణికంఠస్వామి అభిషేక సేవలు చేసారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నారాయణరాజు, పవన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు రంపచోడవరం వాస్తవ్యులు వరలక్ష్మి, శ్రీనివాసరావు లక్ష్మీ దంపతులు (సూర్య ఫోటో స్టూడియో, రంపచోడవరం) వారు అన్నదానం చేసారు. ధర్మ ప్రచార సేవాభక్త మండలి కో–ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి ఆధ్వర్యంలో సేవాభక్త మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం జరిగింది.

## వి.రత్నకుమారికి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు వి.రత్నకుమారి సిద్ధాంత వ్యాసం "డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇయర్ డిటెక్షన్ అండ్ రికగ్నిషన్ అల్గోరిథమ్స్ ఫర్ అక్లూడెడ్ అండ్ నాయిసీ ఎన్విరాన్ మెంట్" జెఎన్టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది. ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది. వి.రత్నకుమారి తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్టియుకె యూనివర్శిటీ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఏసిఈ) & ఈసిఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.బి.లీలాకుమారి మరియు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & మేనేజ్‌మెంట్ ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.పి.రాజేష్ కుమార్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

## జనవరి 22న ఓటరు తుది జాబితా ప్రకటన కోసం సంసిద్ధంగా ఉన్నాం

- జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత




**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం ఉదయం కలెక్టర్లుమరియు జిల్లా ఎన్నికల అధికారులతో పలు ఎజెండా అంశాలపై దిశా నిర్దేశనం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత,ఇతర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఓటరు జాబితా సంబంధించి మార్పులు, చేర్పులు, తొలగింపులకుసంబంధించి వచ్చిన దరఖాస్తులను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించడం జరిగిందన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024మేరకు తుదిఓటరుజాబితా రూపకల్పన మరియు ఖచ్చితత్వం కోసం తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఆమేరకు సంబంధిత నియోజక వర్గ ఓటరు నమోదు అధికారులు దిశా నిర్దేశనం చేశామన్నారు.

ది21.01.2024 నాటికి తుదిఓటర్ల జాబితాలను సిద్దంచేసినివేదిక అందచేసి, జనవరి 22నతుది జాబితా విడుదల చేయనున్నట్లుతెలిపారు. మార్పులు,చేర్పులలో భాగంగా ఫోటో సారూప్య ఎంట్రీలు మరియు డెమోగ్రాఫికల్ సారూప్యఎంట్రీలు,చనిపోయిన,నకిలీ,మార్చబడిన ఓటర్ల తొలగింపుమరియుతార్కికలోపాలు/ క్రమరాహి త్యాల సవరణ మొదలైన వాటిపై ధృవీకరణ చెయ్యడం జరిగిందన్నారు.జనవరి 22న ఓటరు జాబితా ప్రకటన తదుపరి జిల్లా ఎన్నికల అధికారి,నియోజకవర్గ ఎన్నికల అధికారి, పోలింగ్‌బూత్‌లవద్ద ఆయాజాబితాను ప్రకటిం చడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడం కోసం పోలింగ్ కేంద్రాలలో తగిన కనీస వసతులు అందుబాటులో ఉంచడం పోలింగ్ సిబ్బందిగా నియామకం కోసం ఉద్యోగుల డేటాబేస్ తయారీ చేపట్టడం జరుగుతున్నట్లు తెలియ చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు 25.01.2024న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్నట్లు తెలియ చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారులకు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఇతర అనుబంధ అధికారులకు శిక్షణ కోసం తగిన సమావేశ మందిరాలను గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు.

## అధిష్ఠానం ఆదేశిస్తే... టిడిపి జెండా రెపరెపలాడిస్తా

- ఎన్నికల నిర్వహణ మాకు కొత్తకాదు
- పార్టీలకతీతంగా సంపూర్ణ బంధువర్గం నియోజకవర్గంలో
- మాజీ ఎమ్మెల్యేగా అందరికీ సుపరిచుతురాలినే
- టిడిపి–జనసేన విజయం తథ్యం
- మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** అమలాపురంలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మాజీ ఎమ్మెల్యేనైన తనకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశిస్తే అమలాపురం అసెంబ్లీ నుంచి పోటి చేసేందుకు సిద్ధంగా వున్నానని మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి ప్రకటించారు. మహిళాగా తనకు ఈ అవకాశం అధిష్టానం కల్పించాలని ఆశిస్తున్నానని ఆమె అన్నారు. శుక్రవారం అమలాపురంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగదీశ్వరి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేస్తూ పార్టీని గ్రామాల్లో బలోపేతానికి క్రమశిక్షణ కలిగిన నాయకురాలిగా తన వంతు కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణ మాకు కొత్త కాదన్నారు. మాజీ ఎమ్మెల్యేగా అందరికీ సుపరిచితురాలినే నని గుర్తు చేశారు. ఇప్పటికే తమ నాయకుడు చంద్రబాబును కలిసి పలుమార్లు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించమని కోరానన్నారు. అందుకు ఆయన సుముఖంగా వున్నారన్నారు. అమలాపురం నియోజకవర్గంతో తమ కుటుంబానికి ఎంతో ఆదరణ ఉందన్నారు. పార్టీల కతీతంగా సంపూర్ణ బంధువర్గం నియోజకవర్గంలో ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి–జనసేన విజయం తథ్యమని మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి ధీమా వ్యక్తం చేశారు. చిల్లా పురుషోత్తం మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అంబేద్కర్ స్మృతి వనాన్ని నిర్మిచడం పేరుతో దళిత పథకాలు ఎత్తివేసి వారిని 125 ఏళ్ళు వెనక్కి నెట్టేసారని విమర్శించారు. ఈయన ప్రభుత్వ హయాంలో దళితులను ఏ విధంగా ఇబ్బంది పెట్టారో చరిత్ర చెరిగిపోదని పురుషోత్తం అన్నారు. తన భార్యకు గాని తనకు గాని టిడిపి టికెట్ ఆశిస్తున్నామని పురుషోత్తం తెలిపారు.

## అంగన్వాడీ టీచర్ ప్రాణాల్ని బలిగొన్న ప్రభుత్వం

- ఉద్యోగం పోతుందన్న ఆవేదనే గుండెపోటుకు కారణం
- చనిపోయిన అంగన్వాడీ టీచర్ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- బాధిత కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుంది బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** చిన్నపిల్లల ఆలనా పాలనా చూసే అంగన్వాడీ టీచర్ ప్రాణాన్నిజగన్‌ప్రభుత్వంబలిగొందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం గ్రామంలో అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి శాంతికుమారి గుండెపోటుతో మరణించడం బాధాకరమని, న్యాయం చెయ్యాలంటూ గత 39 రోజులుగా పోరాటం చేస్తున్న అంగన్వాడీలు, జగన్ ప్రభుత్వం నేడు ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపుతోనే మనోవేదనకు గురై గుండెపోటు వచ్చి చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతికుమారి కుటుంబాన్ని పరామర్శించి అండగా వుంటామని, ప్రభుత్వం తక్షణమే శాంతికుమారి కుటుంబాన్ని ఆదుకుని తగిన న్యాయం చెయ్యాలని కోరారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించి కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ టీచర్ కుటుంబాన్ని ఆదుకోవాలని చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందని, తగిన సహాయాన్ని తెలుగుదేశం పార్టీ అందిస్తుందని తెలిపారు. అనంతరం అంత్యక్రియల కు బయలుదేరిన శాంతికుమారి శవయాత్రలో పాల్గొని శవపేటికను మోశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, అమలాపురం పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, సర్పంచ్ గెద్దం సుధ, కాకి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి బయ్యనగుడెంకి చెందిన నాటకసాల వెంకటరాజు, సత్యవతి దంపతులు రూ.60,116లు; విశాఖపట్టణంకు చెందిన టి.శేషు కుమార్, శ్రీలక్ష్మి దంపతులు రూ.25 వేలు; ములస్థానంకు చెందిన వై.ఎల్.ఎన్.ఎం. వెంకట సూర్య ప్రకాష్ రూ.21,720లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం స్వామివారి దర్శనం చేయించి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ రుద్దరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## గుండెపోటుతో అంగన్వాడీ కార్యకర్త మృతి





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** జీతాలు పెంచాలని కోరుతూ ఉద్యమంలోకి పాల్గొనటానికి వెళ్తున్న ఆత్రేయపురానికి చెందిన కె.శాంతి కుమారి (50) గుండెపోటుతో మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం 38 రోజులుగా నిత్యం ఆమె తోటి సిబ్బందితో కలిసి ఉద్యమంలో పాల్గొనేందుకు కొత్తపేట వెళ్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి నుండి బయటకొస్తున్న ఆమె గుండెపోటుతో కుప్పకూలిపోయింది. ఆసుపత్రికి తరలించే లోపే ఆమె మృతి చెందినట్లు గుర్తించారు.

ఈ సందర్భంగా సంఘ నాయకురాలు పత్రా వెంకటలక్ష్మి మాట్లాడుతూ మేమంతా ఉద్యమంలో పాల్గొనేందుకు నిత్యం ఆటోపై వెళ్తున్నామన్నారు. ఇంతలో ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. న్యాయమైన డిమాండ్ కోసం పోరాడుతున్నామని, జగన్ ప్రభుత్వం సమస్య పరిష్కరించడంలో మొండిగా వ్యవహరిస్తుదన్నారన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు. రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు, మండల టిడిపి అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, సర్పంచ్ గద్దం సుధా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డివిఈఓ అకస్మిక తనిఖీ

- తరగతి గదులు పరిశీలన

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా డివిఈఓ యస్.వి.వి. సత్యనారాయణ రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణకు సంబంధించి తరగతి గదులను పరిశీలించారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టిన జయీభవ 50 రోజుల కార్యక్రమానికి సంబంధించి ప్రతి అధ్యాపకుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకుని చదివించే విధానంలో భాగంగా విద్యార్థులకు సంబంధించి రాబోయే పరిక్షలలో విద్యార్థులు మంచి మార్కులు సాదించడానికి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు.

పబ్లిక్ పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున అధ్యాపకులు ప్రణాళికను సిద్ధం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత శాతం సాదించాలని, కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. కళాశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్ ద్వారా మాట్లాడి, కళాశాలకు విద్యార్థులు వచ్చే విధంగా చూడాలని సుచించారు. అనంతరం కళాశాలలో జరిగిన నాడు – నేడు పనులను పరిశీలించారు. వీరితోపాటు కళాశాల ప్రిన్సిపల్ పి.గోపాలకృష్ణ, అధ్యాపకులు ఉన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
శనివారం
20 జనవరి 2024
2

## జగన్ కేసులో కోడి కత్తి శ్రీనును విడుదల చేయాలని టిడిపి నిరసన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** దళితులపై వైసీపీ నేతలు చేస్తున్న దాడులను నిరసిస్తూ, కోడి కత్తి కేసులో అరెస్ట్ కాబడి ఐదు సంవత్సరాల నుండి జైలు జీవితం గడుపుతున్న శ్రీనుకి మద్దతుగా వున్న శుక్రవారం సామర్లకోట మఠం సెంటర్‌లో టిడిపి పట్టణ అద్యక్షులు అడబాల కుమారస్వామి ఆధ్యర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం నాయకులు మాట్లడుతూ, వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా కుట్రలు చెస్తూ దళితులపై దాడులు చేయిస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బడుగు శ్రీకాంత్ కంటే జగదీష్ మోహన్ బలుసు వాసు సారయ్య తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఎన్నికలలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఇవిఎం)ల ద్వారా ఓటు వేసే విధానంపై ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు పెద్దాపురం పురపాలక సంఘంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానాన్ని మాస్టర్ ట్రైనర్ ఎం.జగన్నాధరావు (ఎంపిడిఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్) ప్రజలకు వివరించారు. ఆయన తెలుపుతూ ఇప్పటివరకు సుమారు 500 మందికి ఇవిఎంలపై అవగాహన కల్పించడం జరిగింది. అలాగే వారితో నమూనా ఓటు వేయించామన్నారు.

# ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ

**– జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలతో కలిసి హాజరయ్యారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024, ఓటర్ల తుది జాబితా ప్రచురణ, ఎన్నికల సిబ్బంది డేటా బేస్, ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పన, జాతీయ ఓటర్ల దినోత్సవం (జనవరి 25) తదితరాలపై సీఈవో



సూచనలు చేశారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్..ఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కృతికా శుక్లా మాట్లాడుతూ ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఎన్నికల సిబ్బందిగా విధుల నిర్వహణకు అవసరమయ్యే ఉద్యోగుల డేటాబేస్ రూపకల్పనను పూర్తిచేయడంపై దృష్టిసారించాలని ఆమె తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆర్వో, ఏఆర్వోల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం (ఎన్వీడీ) నేపథ్యంలో జిల్లాలో బూత్ స్థాయి వరకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి,పెద్దాపురం,తుని,జగ్గంపేట, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్వోలు, కాకినాడ అర్బన్, పిఠాపురం తహసీల్దార్లు పీవీ సీతాపతిరావు, పి.శ్రీనాథ్‌రావు, ఎన్నికల డీటీఎం జగన్నాథం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళి ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. తెదేపా వ్యవస్థాపకులు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వర్ధంతిని పురస్కరించుకుని పెద్దాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు గుణం చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరాన్ని ఆయన కార్యాలయంలో నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన శిబిరంలో 85 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు ఈ సందర్భంగా శిబిర నిర్వాహకులు చంద్రమౌళి మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తాన్ని అందించడం ద్వారా ప్రాణదాతలు కావచ్చును అన్నారు ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రాలకు అందించిన సేవలను దృష్టిలో పెట్టుకొని ఆయన వర్ధంతి సందర్భంగా తనవంతు సేవలను సమాజానికి అందించే విధంగా ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కామరాజు, డాక్టర్ కిషోర్, గ్రామానికి చెందిన పార్టీ నాయకులు గోలి వెంకట్రావు,అదబాల చిట్టిబాబు, గుమ్మల్ల కృష్ణమూర్తి, రాజు, అధిక సంఖ్యలో గ్రామ నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట

**– గొంగడి వెంకటరామిరెడ్డి**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేశారని గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి అన్నారు. అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామ సచివాలయ పరిధిలో పినపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో స్థానిక సర్పంచ్ గుండి సీతా లక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా గుండాల ఎంపిటిసి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పట్టణాలకే పరిమితమైనటువంటి వైద్యాన్ని మన ప్రభుత్వం వచ్చాక 108, 104 ద్వారా వైద్యాన్ని అందించడమే కాకుండా ఏఎన్ఎంలు, మెడికల్ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుంది అని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ కూడా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న రెండవ దశ హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్ తోట శశి కుమార్, కన్వీనర్ ఎర్రగోళ్ల నరసింహారావు, చింతూరు ఏరియా హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ ప్రత్యూష్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విష్ణుప్రియ, డాక్టర్ సాయి, పిహెచ్ఎన్ అరుంధతి, హెచ్.వి. సీత, సిహెచ్ఓ లక్ష్మి, ఏఎన్ఎమ్ జయ, సచివాలయ సెక్రటరీలు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోతవరంలో రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమహేంద్రవరం వారిచే అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పోతవరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానంద మహరాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 70 మంది రోగులకు డాక్టర్ దాసరి ఉమా మహేష్ వైద్య సేవలు అందించి అవసరమైన 37మందికి రక్త పరీక్షలు చేసినట్లు స్వామీజి తెలిపారు. ప్రతీ నెల మూడో శుక్రవారం పోతవరం గ్రామంలో వైద్య శిబిరం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని స్వామీజి కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ దాసరి ఉమా మహేష్, రామ కృష్ణ మిషన్ కో–ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

21న ఉచిత కంటి వైద్య శిబిరం :రామకృష్ణ మిషన్, రాజమహేంద్రవరం వారిచే రంపచోడవరం మండలం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అవరణలో ఈనెల 21వ తేదీ ఆదివారం నాడు సాధారణ వైద్య శిబిరంతోపాటు పరమహంస యోగానంద నేత్రాలయ వేమగిరి వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైనవారికి మందులు, కళ్ళ జోళ్లు ఇవ్వనున్నట్లు స్వామీజి తెలియచేసారు. అలాగే కంటి ఆపరేషన్లు (కాటరాక్ట్) అవసరమైనవారికి పరమహంస యోగానంద నేత్రలయ వేమగిరి తరలించనున్నట్లు స్వామీజి తెలిపారు.

కంటి ఆపరేషన్లు నిమిత్తం వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు తీసుకురావాలని కోరారు. అలాగే సామాన్య రోగాలకు వైద్యులు చూస్తారని స్వామీజి తెలిపారు. ఈ అవకాశాన్ని ఏజెన్సీ ప్రాంతంలోని రోగులు సద్వినియోగపరుచుకోవాలని స్వామీజి విజ్ఞప్తి చేశారు.

## పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



**– 200 బైకులతో భారీ ర్యాలీ**

**పెదపూడి, మేజర్ న్యూస్ :** పద్మశాలీల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలోనే సాధ్యపడిందని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన పెదపూడికి చెందిన వైఎస్ఆర్సిపి మండల బీసీ సెల్ కన్వీనర్, కాకినాడ జిల్లా పద్మశాలీల సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు సింహాచలంను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శిగా నియమించిన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెదపూడి నుండి సుమారు 200 మోటార్ బైకులతో భారీ ర్యాలీతో వైఎస్ఆర్సిపి నాయకులు, పద్మశాలీల సంఘం నాయకులతో కలిసి పప్పు సింహాచలం అనపర్తికు చేరుకున్నారు. ఈ ర్యాలీ మార్గమధ్యలో పెద్దాడ, జి.మామిడాడ, బిక్కవోలు, బలభద్రపురం తదితర గ్రామాల్లో వైఎస్ఆర్సిపి నాయకులు పప్పు సింహాచలానికి సాలువా లు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. అలాగే అనపర్తి దేవి చౌక్ వద్ద అభిమానులు బాణసంచా కాల్చారు. అనంతరం వైకాపా కార్యాలయం కు చేరుకొని ఎమ్మెల్యేను సింహాచలం, చేనేత సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పప్పు సింహాచలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చేనేత విభాగ కార్యదర్శి పదవిని బాధ్యతగా తీసుకొని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేస్తారని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేను మరోసారి భారీ మెజారిటి తో గెలిపిస్తానని పప్పు సింహాచలం ప్రకటించారు. ఈ సందర్భంగా పప్పు సింహాచలానికి ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డిని సింహాచలం శాలువ కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే సింహాచలాన్ని కూడా ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కార్యకర్తలు సింహాచలానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, జడ్పిటిసి పేపకాయల వెంకటలక్ష్మి వెంకటరమణ, ఎంపీపీ కేత తులసి శ్రీనివాస్, మండల కన్వీనర్ గుత్తుల రమణ, వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మ వెంకటరెడ్డి (చింతపండు), పెదపూడి గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, ఎంపీటీసీ సమ్మంగి దుర్గప్రసాద్, పచ్చారు శివశ్రీ, పప్పు జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌ని గౌరవించుకోడం మన సాంప్రదాయం



కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ సూచనలతో కాకినాడ సిటిలోని సీనియర్ సిటిజన్స్‌ని గౌరవించుకుని వారి అనుభవ పాఠాలతో సూచనలు కోరుతూ సమాజానికి మీరే గౌరవం కావాలి మాకు మీ అనుభవం కార్యక్రమం రావిపాటి వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం 44వ డివిజన్ మెహర్ నగర్ ప్రాంతంలో జరిగింది.

సమాజంలో వివిధరకాల వయసులవారు ఉంటారనీ, చిన్న వయసు పిల్లలకు పెద్దవారు తమ అనుభవాల సారాన్ని చెప్పి వారికి మార్గనిర్దేశం చేయడం మన సంస్కృతి అన్నారు. సీనియర్ సిటిజన్స్ ని గౌరవించుకోడం మన సాంప్రదాయమన్నారు, ఇందులో భాగంగా నగరంలో వీరిని కలిసి ఆశీర్వాదాలు తీసుకుని జనసేన పార్టీకి వీరియొక్క సలహాలు, సూచనలను అందించవలసినదిగా కోరారు. సమాజంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న అసమానతలను రూపుమాపేందుకు వీరి అనుభవంతో మెరుగైన మార్గాన్ని జనసేన పార్టీకి తమ నాయకుడు పవన్ కళ్యాణ్ కి అందించవలసినదిగా పోస్టల్ కవర్లను అందచేస్తూ కోరారు. ఈకార్యక్రమంలో ముమ్మిడి రవిచంద్ర, తుమ్మలపల్లి సీతారాం, ముమ్మిడి నాగేశ్వరావు, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి



కాకినాడ, మేజర్ న్యూస్ : జనవరి 26న నిర్వహించబోయే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ డా.కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లను చేయాలన్నారు. గత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నామని, అదే తరహాలో అధికారులు వారికి కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహిస్తూ విజయవంతం చేయాలని తెలిపారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పోలీస్ పెరేడ్‌ను సిద్ధం చేయడంతోపాటు పోలీస్ బ్యాండ్, జెండా ఆవిష్కరణ వేదిక, బందోబస్తు, తదితర అంశాలకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా విద్యా శాఖ అధికారి కనీసం ఐదు సాంస్కృతిక కార్యక్రమాలకు తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య, మార్కెటింగ్, డ్వామా, పీఆర్, డీపీవో, హౌసింగ్, టిడ్కో, కుడా, విద్య, డీఆర్డీఏ, మెప్మా, ఆర్డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, హెల్త్ తదితర శాఖలు సమన్వయంతో ప్రభుత్వ పథకాలు ప్రతిభింబించేలా శకటాలు, స్టాల్స్ ఏర్పాట్లకు ప్రణాళిక ప్రకారం రూపొందించి సిద్ధం చేయాలన్నారు. మెరిటోరియస్ సర్టిఫికెట్ల కోసం ఆయా శాఖలకు సంబంధించి పేర్లను జిల్లా రెవెన్యూ అధికారికి పంపించాలన్నారు. అవార్డు గ్రహీతలు సాధించిన పనితనం గురించి సంక్షిప్తంగా తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. పోలీస్ మైదానం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు సమయంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు అధికారులు సూచించారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, ఇన్చార్జి డిఆర్వో, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, పోలీస్, ఎన్.సీ.సీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్

**– బలహీనుల మార్గదర్శకులు అంబేద్కర్**
**– మార్కెట్ కమిటీ సభ్యులు మాచర్ల గంగయ్య**



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** బడుగుల ఆశాజ్యోతి, బలహీనుల మార్గదర్శకుడు అంబేద్కర్125 అడుగుల విగ్రహాన్ని విజయవాడలో నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేయడం ఓ అద్భుతమైన కార్యక్రమమని (వై.సి.పి.)మార్కెటింగ్ సబ్యులు మాచర్ల గంగయ్య, ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం విజయవాడ ప్రారంభ కార్యక్రమానికి వరరామచంద్రాపురం,మండలం రేఖపల్లి (అంబేద్కర్ నగర్)నుండి అంబేద్కర్ అభిమానులు, వై.సి.పి.పార్టీ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాచర్ల గంగయ్య,మాట్లాడుతూ బడుగులను బలంగా మార్చిన ఘనత అంబేద్కర్ దేనని ఆయన అన్నారు.చట్టాలను అద్భుతంగా చేసి నేడు అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆనాడు ఆయన చేసిన చట్టాలను నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,తూచాతప్పకుండా పాటిస్తూ విజయవాడ మహానగరంలో విగ్రహాప్రతిష్ఠ చేయడం బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలుచేస్తోందని ఆయన చెప్పారు. అంబేద్కర్ ఆశయాలను అనుసరిస్తూ పాలన చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆయన తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చట్టాలను అనుసరించి బడుగులకు సమాన అవకాశాలు ఇవ్వడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, సమ న్యాయం పాటిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఈ అంబేద్కర్ విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమాలను,వెళ్లిన వారిలో శ్రీరామగి దేవస్థానం చైర్మన్ రేవు బాలరాజు(బాలయ్య)బడుగుల పొట్టయ్య,చీమల వెంకన్న,మాచర్ల రాములు,చీమల శేఖర్, తదితరులు హాజరయ్యారు.

## ట్రైలర్ ఢీ కొని సీసీ కెమెరాలు ధ్వంసం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట – కాకినాడ రోడ్డులోని అచ్చంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి సెంటర్ లోని సీసీ కెమెరాల స్తంభాన్ని ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రెయిలర్ ఢీ కొట్టడంతో సీసీ కెమెరాలకు చెందిన స్తంభం ధ్వంసమయ్యింది. ఈ ప్రమాదంలో మూడు సీసీ కెమెరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శుక్రవారం తెల్లవారు జామున పెద్దాపురం వైపు నుంచి కాకినాడ వైపు వెళుతున్న లారీ ట్రెయిలర్ డ్రైవర్ నిద్ర మత్తులో వాహనాన్ని నడుపుతూ సీసీ కెమెరాల యూనిట్ ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రమేష్ కుమార్ కేబిన్ నుంచి క్రింద పడిపోగా అతని చేతికి గాయమైంది. అతనిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా సీసీ కెమెరాల సిగ్నలింగ్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని పాడైన కెమెరాలకు రిపేరు నిమిత్తం పంపించి విరిగి పడిన స్తంభాన్ని తొలగించారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగా రావు, సిబ్బంది సహాయంతో ట్రెయిలర్ ను తొలగించి ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా సేవల నందించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసు స్టేషన్లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

## 400 లీ. బెల్లపు ఊట ధ్వంసం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెద్దాపురం సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) సిఐ కె.వి.స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దాపురం సెబ్ స్టేషన్ పరిధిలో గల జగ్గంపేట మండలం, నరేంద్రపట్నం గ్రామంలో నిర్వహిస్తున్న సారా బట్టీలపై సెబ్ సిఐ తమ సిబ్బందితో దాడి చేసి రహస్యంగా నిల్వ ఉంచిన 400 లీ. బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీ. నాటుసారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సిఐ కె.వి.స్వామి తెలిపారు. పెద్దాపురం స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సిఐ స్వామి తెలిపారు. అంతేగాకుండా ఎవరైనా నాటు సారా అమ్మినా, తయారుచేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడులలో ఎస్సై వై.నాగేంద్రకృష్ణ, సెబ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక స్పందన వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అందిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని డిఆర్ఓ శ్రీరమణి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాలులో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో జీఎస్ఎస్ శ్రీనివాసులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు డిఆర్ఓ స్వీకరించారు. వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులకు పంపించి నిర్దిష్ట గడువులోగా పరిష్కారించవలసిందిగా ఆదేశాలిచ్చారు. భూసమస్యలు, రెవెన్యూ సేవలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పెన్షన్ తదితర అంశాలపై మొత్తం 15 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శ్రీరమణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక స్పందనలో అందిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం నిమిత్తం శుక్రవారం 4 గంటల నుంచి 5గంటల వరకు ఉద్యోగుల గ్రీవెన్స్ నిర్వహించారు. ఉద్యోగుల ఇంక్రిమెంట్స్, బదిలీలు వంటి ఇతర అంశాలపై 4 అర్జీల అందాయి. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.